**కథానిక:**

5854/T

# తనని గురించిన నిజం

"బుచ్చిబాబు"

★

'నేనెందుకు మంచివాణ్ణిగా వుండాలి?' అని భార్యను కసురుకున్నాడు, రామ్మూర్తి. ఆ ప్రశ్నతో శాంతమ్మ ప్రశాంత జీవితంలో తుఫాను చెలరేగిందనొచ్చు.

ఇంతకీ తాను చేసిన అపరాధం ఏమిటి? బెల్లం కలిపిన కాఫీ యిచ్చింది. భర్త కాఫీ తాగిం తర్వాత 'ఇది నాలుగో మాసం' అన్నది. అంతే...

ఈ మాత్రానికి భర్త చేసిన వింత వ్యాఖ్యానం వితర్కించు కోటం కోసం, పెద్దబ్బాయి 'రఘు' తో వంటింట్లో కెళ్లింది. శాంత. ముగ్గురు పిల్లల తల్లి; మొగపిల్లలే. పెద్దాడిముందు అల్లా విసుక్కోడంలో అర్థమేమిటి? వాడికింకా తొమ్మిదో ఏడే. ఐనా ఏమనుకుంటాడు? ఏమిటి మంచితనం? చేసుకున్న పెళ్లానికీ, కన్నపిల్లలకీ యింత కూడెట్టడమేనా? ముందుంది ముసల్ల పండగ. ఈసారి ఆడపిల్లైతే మరీను. అబ్బాయిల 'సతుకు' లున్నాయి. బెల్లంకూడాలేని కాఫీ, మహారాజులా తాగలా? సంసారంలో ఎన్నెన్నో చిక్కులు, యిబ్బందులూ వుంటాయి. దగ్గర దగ్గరగా ఇగుసై ర్యేళ్లనుంచి చేస్తున్న కాపరంలో ఎన్నో అవాంతరాలు సంభవించాయి. వాటన్నింటినీ సర్దుకుపోలా? ఎప్పుడేనా యిల్లా విసుక్కున్నారా? ఐనా, ఎందుకు మంచివాణ్ణిగా వుండడమేమిటి, నా తలకాయ...! హాల్లో అద్దంలో తన మొహం చూచుకుంది శాంత. ఏదో భావం స్ఫురించినట్లు—చిరునవ్వుతో పెదవి వొంపు తిరిగింది. ఆ నవ్వు మాయమవకుండానే భర్త దగ్గర కెళ్లి, "ఓ వేళ మూడో మాసమేనేమోలెండి" అంది.

రామ్మూర్తి మాట దిగమింగేసుకొని, ముందు గదిలో కెళ్లి, పేపరు చదువడానికి యత్నం మొదలెట్టాడు. ఇందాక దిగమింగిన మాటని పైకనుకొని విన్నాడు. "ఇంకెంతకాలం మంచిగా వుండటం?" మూడో మాసమైతే యింకా ఏడు నెలలా? బల్ల మీద అద్దంలో మొహం చూచుకున్నాడు. కళ్ళకింద గీట్లు స్ఫుటంగా అవుతున్నాయి. తల్లో నెరుస్తున్న వెంట్రుకల సంఖ్య పెద్దదవుతోంది. రెండుమూడు రోజులదాకా క్షురకర్మ చేసుకోకుండా వుండడానికి వీల్లేదు. లెక్కకి పదహారు తెల్ల వెంట్రుకలు గడ్డం కింద; మళ్లా జాగ్రత్తగా లెక్కపెట్టాడు. పదిహేనే. రెండో వాడు "సేతు" బల్లకింద సిరాబుడ్డితో ఆడుకుంటున్నాడు. ఇదుగో యీ పిల్లలే కారణం. సంతానం కలిగినప్పుడెల్లా, ఐదేసి నెరిసిన వెంట్రుకలు. సిరాబుడ్డి లాక్కుని, 'సేతు' వీపుమీద వొక్క చరుపు చరిచి తోసేసి, తలుపు గడియపెట్టి, రామ్మూర్తి తన నిజ స్వరూపంతో పెనగులాట సాగించాడు.

రెండుమూడు నెలలనుంచి, మహత్తరమైన మానసిక శక్తులతో భర్త పెనుగులాడుతున్న సంగతి, పాపం, శాంత తెలుసుకోలేదు. మనిషికీ మనిషికీ మధ్యలోనే కాదు గోడ లుండటం. ప్రతి మనిషిలోనూ వొక పల్చటి తెర వుంటుంది. ఆ తెర వూడిపోకుండా సంఘం కాపలా కాస్తుంటుంది. కాని రాత్రి ఎప్పుడో—మందువేసంగి రాత్రి మైమరచి నిద్రపోతుంటేనో, వాన చినుకులు పడి భూమి పొంగినప్పుడో—ఎప్పుడో ఎందుకో తెర విడిపోతుంది. నిజస్వరూపం భయంకరంగా, కనబడుతుంది. విసుక్కుంటుంది; తిడుతుంది; కొడుతుందికూడా. అతని మనస్సులో తెర యిప్పుడు తొలగింది.

రామ్మూర్తికి నలభయ్యో సంవత్సరం వొస్తోంది. సంసారానికి అతన్ని కట్టిపడేసిన సంకెళ్లు తెగాయి. సంఘానికి అర్థమయ్యే గౌరవమైన భావాలు,—'మర్యాదభాష' మాట్లాడాలంటే అతను కష్టపడాలి. అతని అంతర్యంలో కలిగిన చాంచల్యం, ప్రజాస్వామ్య రాజ్యాంగంపై వ్యక్తిత్వం చేసిన తిరుగుబాటు. అనాది నుండీ, కళలు, సంస్కృతులూ దేనికోసం ప్రార్థిస్తున్నాయో, అది అతనిలో అవతరించింది. మతానికీ, సాంప్రదాయానికీ, కట్టుబాట్లకీ, నియమాలకీ లొంగని వ్యక్తిత్వ ప్రకర్ష, అసలదేమిటో తెలుసుకుంటే అది సంభవమే కాదు.

ఈ మార్పుకి కారణం కొంతవరకూ శారీరకమే. గతించిపోతున్న యవ్వనానికి శరీరంయిచ్చే వీడ్కోలు తాలూకు కోలాహలం; ఆరిపొయ్యేముందు ప్రజ్వరిల్లిన మంటలాంటిది ఆ అనుభవం. జీవితం పాదాలకిందనుండి జారిపోతున్నట్లు ఏదో భయం. ఇల్లు, వుద్యోగం, పిల్లలు, తిండి, నిద్ర—యింతేనా? ఇంకే మీ జరగదు? తన వునికిని సంఘం గుర్తించినట్లు నిర్ధారణ లేదు. పిల్లల ద్వారా, భార్య పరిపూర్ణత చెందొచ్చు; నిర్ధారణ చేసుకోవచ్చు. తన కది చాలదు. పిల్లలు తనజీవితంలో ఆహ్లాదకరమైన మార్పు తీసుకురాలేదు. పైగా ముగ్గురూ వాళ్లమ్మపోలికే— శాంత అనాకారి కాదు. ఐనా ఆడపిల్లలుండి వాళ్లకి ఆ పోలిక వస్తే, అందంగా వుండి వుందురేమో... ప్రస్తుతంలో పిల్లలు అతనిలో తెచ్చిన మార్పు, అతన్ని పెద్దవాడికింద చెయ్యడం; ఇంక ఆరునెల్లల్లో అతను వృద్ధుడన్నమాటే! శాంత సౌందర్యాన్ని, అతని యవ్వనాన్ని ధ్వంసంచేసేందుకు యీ పిల్లలు.

రామ్మూర్తి చిన్నతనంలో ఎన్నో మధురమైన కలలు కన్నాడు. పాశ్చాత్య సంపర్కంవల్ల అతనిలో విప్లవపూరితమైన ఆదర్శాలు వుద్భవించాయి. పెండ్లి, ప్రేమ, సంతానం, వీటిని గురించిన ఆధునిక తత్వం అతనికిబాగా పట్టు పడింది. ఆ దంతా ఏమైంది? అందరికీ

మళ్లేనే వివాహం చేసుకున్నాడు. ప్రేమించి చేసుకున్న పెండ్లి కాదు. శాంత ప్రేమనుగురించి ఎప్పుడైనా మాట్లాడిందా? శాంత ప్రేమించడం అన్న భావమే హాస్యాస్పదంగా తోస్తుంది. పెరిగిపోతున్న జనాభాసమస్య మరిచిపోయి అందరిలాగే పిల్లల్ని కన్నాడు. కళాతృష్ణ, కార్యసాఫల్యత, అన్వేషణ, సంస్కారారాధన— అన్నీ మంటగలిసినై. జీవితంలో ఔన్నత్యం, నూతనత్వం, ప్రతిభ-ఏవీ లేవు. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో పౌరుడల్లే అతనొక సామాన్యమానవుడై కనీసపు హక్కులకోసం పెనుగులాట మాని, గాంధీగారాదేశించిన బాధ్యతల్ని నిర్వహించుకునే గతి పట్టింది. ప్రజాస్వామ్యం పేలవంగా తయారవగల్దు.

రామ్మూర్తి హృదయంలో కలిగిన యీ పరివర్తనని, జాత్య జీవితప్రకర్ష అనొచ్చు. కొందరికిది అరవయ్యోయేట సంభవించొచ్చు. మరికొందరికి, సలభయ్యోయేట జరగొచ్చు. అవుతే, యీపరివర్తన అందరికీ కలుగుతుందా అంటే చెప్పలేం. బహిర్గతంగా ఋజువుకాక పోవచ్చు అందరిలోనూ. పెండ్లిచేసుకున్న వారందరూ ప్రేమని పొందగలిగారా? తనమట్టుకు తను—స్త్రీకోసం వివాహాన్ని అంగీకరించాడని వొప్పుకోకతప్పదు. కోర్కెలని సాధించలేని వా రందరూ, విషాదజీవులయి, కళాకన్యముసుగు తొలగించి, కన్నీటిని స్పృశించి అమరజీవులుగానో, అనామకులుగానో, కాలవాహినిలో కలిసిపోతున్నారు. వీరివి నశించిపైన జీవితాలు; కొందరికి అట్లా నశింపు కావడమే జీవిత పరమావధి. రామ్మూర్తి చెడ్డవాడై నశించడానికి సమకట్టాడు.

తనమీద విసుక్కున్న నెలరోజులకే ఈ మార్పుకి నిదర్శనాలు, శాంతకిదొరకడం మొదలెట్టాయి. ఆ రోజున రామ్మూర్తిగారు ఇంట్లోలేడు. కాంప్ వెళ్ళాడు. పోస్టుబంట్రోతు కవరు తెచ్చాడు. అది రామ్మూర్తిగారికే. బల్లమీద పెట్టింది. సాయంత్రానికి, మూడో కుర్రాడు 'గోపి' యథాప్రకారం విధ్వంసక యజ్ఞం సాగించాడు. వాడిదృష్టికి గోచరంకాని వొస్తువులుకొద్ది. ఈ కవరు వాడి సిద్ధహస్తాల్లోపడి నశింపుకాబోయే అవస్థలో శాంత దాన్నిలాక్కుంది. లోపల వుత్తరం తెలుగులోవుంది. అడ్రెసు, తేదీ లేవు. శాంతకి నాగరికతాత్వం తెలియదు. ఉత్తరంచదవడం తప్పనుకోదు. భర్త ఆ చర్యని ఆమోదిస్తాడుకూడా. వారి అన్యోన్యానికి అదొక చిహ్నం.

"ప్రియమైన మూర్తి—ఎంతో సాహసంచేసి యీ వుత్తరం వ్రాస్తున్నాను. నీకు భార్యా, పిల్లలు వుండడంవల్ల నేనింతవరకూ తెగించలేకపొయ్యాను. జీవితం గతించిపోతూ ఎప్పుడో అప్పుడు తెగించి దౌర్జన్యం చెయ్యాలికదా...ఇంతవరకూ అణిగివుండగలగడమే మనం సంఘంకోసం చెయ్యగలిగిన త్యాగం. నువ్వు నన్ను ప్రేమిస్తున్న విషయం ఏనాడో తెలుసు. కాని నా విషయం నీకంతగా తెలియదనుకుంటాను. భారత స్త్రీ ఆశ్వేషించదు. తలుపు సందున చూస్తూ నిరంతరం వేచివుంటుంది. తలుపుతోసి నువ్వు లోపలికొచ్చావు. నేను గడప దాటక తప్పిందికాదు. ఎప్పుడో నన్ను ఏకాంతంలోకి తీసుకెడతావని ఆశిస్తున్నా. ఇవాలుకోసం నేను వేచియుండను. నాకు వుత్తరా లెందుకు.? కావల్సిందేమిటో నీకే తెలుసు—నీ ప్రియ భారతి."

ఈ "ప్రియభారతి" ఎవరా అని శాంతమ్మ క్షణం ఆలోచించింది. ఈ ఇరవై సంవత్సరాల్లోనూ భారతి అన్న వ్యక్తిగాని పేరుగాని, వారి జీవితంలోకి రాలేదు. ఆశ్చర్యంతో వొక్కసారి ఆమె కళ్లు తళుక్కుమని మెరిశాయి.

రామ్మూర్తి కాంప్‌నుంచి యింటికి రాగానే, చించిన కవర్ను గురించి అడిగాడు.

"అబ్బాయి చింపబోతుంటే తీశాను" అన్నది శాంత.

"చదివావా ?"

"ఆс"—అని, శాంత యింట్లో కెళ్లిపోయింది. తర్వాత ఆ వుత్తరం విషయం ఎవరూ ప్రస్తావించుకోలేదు.

మరో రెండు వారాలు గడిచిం తర్వాత, మంచంకింద వూడుస్తుంటే పని పిల్లకి మరో వుత్తరం దొరికింది. తీసుకెళ్లి శాంతమ్మగారి కిచ్చింది.

"నువ్వు ఎప్పుడూ నాకు సుకుమారుడువిగానే కనిపిస్తావు. వయసులో నువ్వు పెద్దయినా, హృదయంలో పసిపాపవు— లాలించ బుద్దేస్తుంది. వయసు ముదిరిన కొద్దీ మనసు లేత దవుతుందనుకొంటాను. వార్ధక్యంలోపండి, పండులా రాలిపోతుంది. అప్పటికి నా జడలో పువ్వు వాడిపోతుంది. పండు, పువ్వు గాలి, మోడు మిగుల్తుంది. ఆ మోడు నీ భార్య, కొమ్మలు నీ సంతానం. నీ ప్రియ భారతి."

శాంత ఆ వుత్తరం మడిచి, భర్త కిచ్చేసింది. "ఏదో కాగితం మీదే ననుకుంటా" అన్నది.

"అవునవును" అని రామూర్తి ఆతృతతో తీసుకున్నాడు. ఎవరూ, ఏమీ మాట్లాడలేదు.

నెల గడిచిం తర్వాత "రఘు" స్కూలు పుస్తకాలు సర్దుకుంటుంటే మరో వుత్తరం దొరికింది. చదవబోయ్యాడు ; భయపడి మానేసి, తీసుకెళ్లి అమ్మ కిచ్చాడు "రఘు."

"ఏమిటే అమ్మా వుత్తరం ?"

"ఏవో వారి ఆఫీసు కాగితాల్లే..."

"అల్లా లేదే."

"నీ మొహం"

"కాదే—ఎవరో వొకావిడ రాసినట్లుందే..."

"స్వరాజ్య మొచ్చింది కాదుట్రా ఆడవాళ్లుకూడా వ్యవహారాలు స్వతంత్రంగా చూసుకుంటారమ్మా..."

"నాన్నని అడగనా ?"

"ఎందుకూ ఆయనే అడుగుతార్లే." "రఘు" స్కూలు కెళ్లాడు. శాంత ఆ వుత్తరం చదివింది.

"మీ భార్య చాలా అమాయకురాలనీ, మంచిదనీ వింటాను. నన్ను హర్షిస్తుందనుకుంటాను. నిజంగా అట్లా జరిగితే మన కింకేం కావాలి—మన కల లన్నీ యథార్థా లవుతాయి. ఎంతటి దుర్భర జీవితాన్నైనా, మీకోసం భరించగలను. ప్రేమ చూపలేని

చెప్పు, సాధించలేని కార్యం ఏముంది? రాత్రి కలలో కారిన కన్నీటితో దిండు తడిసింది. జడలో పుష్పం సిగ్గుతో ముడుచుకొని మొగ్గయింది. మీరు కోస్తేనే వికసించడం...నీ ప్రియ భారతి..."

భద్రంగా యీ వుత్తరాన్ని మడిచి భర్త బల్లమీద పెట్టి, ఎగిరిపోకుండా పేపరు వెయిట్ వుంచింది శాంత.

రెండో నెల పూర్తయేసరికి, నాలుగో వుత్తరంకూడా వంటింటి గుమ్మం ముందే దొరికింది. అప్పుడు రామ్మూర్తి యింట్లోనే వున్నాడు. యిల్లంతా దేనికోసమో వెదుకుతున్నట్లు గాలిస్తున్నాడుకూడా "ఇక్కడ కొన్ని కాగితాలుండాలి— ఎవరేనా చూశారా?" అన్నాడు.

"ఏం కాగితాలు నాన్నా...?" అన్నాడు రెండోవాడు "సేతు"

"ఇదేనా?" అంటూ శాంత, గుమ్మంముందు పడివున్న వుత్తరం తీసి మడిచి భర్తకిచ్చింది.

"ఆ—యిదే, యిదే," అని దాన్ని తీసుకుని రామ్మూర్తి వెళ్ళిపోయ్యాడు.

ఆ రాత్రంతా రామ్మూర్తికి నిద్ర పట్టలేదు. డాబామీద వెన్నెలగావుంది. లేచివెళ్లాడు. రాత్రి పన్నెండు దాటింది. ఈనాటికి తనభార్య పరాయిస్త్రీగా కనబడసాగింది.

ఆమెతో గడిపిన యిరవైయేళ్లలోనూ స్త్రీ మనస్సు తెలుసుకోడం కష్టమన్న లోకోక్తి వొట్టిదని అయన బుజువుచేసుకున్నాడు. ఏతుణాన, ఏసందర్భంలో తనభార్య ఏం మాట్లాడుతుందో, ఏమనుకుంటుందో ఏం చేస్తుందోకూడా తనువూహించి, నిర్ణయించగలడు. నిజంగా అల్లాగే జరుగుతుంది. అంతబాగా వొకరిమనస్సు వొకరు తెలుసుకోకలగడం అన్యోన్యానికి ముప్పేకావొచ్చు. అది వేరే విషయం. స్త్రీ హృదయంలో రహస్య మందిరాలు లేవని తెలుసుకున్నాడు.

కాని యీ రాత్రి తనకి తనభార్యని గురించి ఏమీ తెలీదని వొప్పుకోవల్సి వొచ్చినందుకు విచారిస్తున్నాడు. రహస్యమందిరంలో తను దుమ్ము, బూజు దులిపాడు— కాని ఏ వొస్తువుకీ మెరుగు పెట్టలేదు.

స్త్రీకి అసూయ మెండంటారు. తన భార్య ఏమీ అసూయ కనబర్చదేం? పోనీ అసూయక్కర్లేదు. కుతూహలం కనబర్చి "ఎవరండీ యీ ప్రియభారతి అనే మహాయిల్లాలు?" అనేనా అడిగొచ్చుగా? నాలుగు వుత్తరాలూ శాంతలో ఏమార్పూ తీసుకురాలేదు. మాట, వైఖరి, చేష్ట-అన్నింటిలోనూ ఎప్పటిలాగే వుంది. శాంతలో ఆధునికతత్వానికి సంబంధించిన సంస్కారంలేదు. ఉన్నతాదర్శాలు, వుజ్జ్వలభావాలు కనబడవు. "ఇదిమూడో మాసం"— అన్నది ఆమె చెయ్యగల కోమల కవితాగానం. ఆమె పూర్వకాలపు స్త్రీ. యుగయుగాల పతివ్రతతో వాడిపోయిన భరతమాత!

పోనీ, తనేభార్యతో "ప్రియభారతి" విషయంప్రస్తావిస్తే? "శాంతే ప్రియభారతి" అని తనే భార్యని కోరడమూ...

ఓవేళ భారతి అభిప్రాయాలు, ఆశయాలు, తనకేమీ పట్టలేదేమో? ఒకస్త్రీకి అవతల స్త్రీ ఏమనుకుంటున్నదీ అక్కర్లేదేమో...? ఆమె క్కావల్సింది తన భర్త ఏమనుకుంటున్నాడు. — అన్న వొక్కటేనేమో...?

ప్రియభారతి వ్రాసినట్లుగా తనే ఎడమచేత్తో ఆ వుత్తరాలు నాలుగూ వ్రాశాడు. ఇప్పుడు వాటికి సమాధానంగా తనే కుడిచేత్తో వ్రాసి, తన భార్యకంటబడేటట్లు చేస్తే...? "ప్రియభారతి"ని కవితాకన్యగా సృష్టించుకున్నాడు. రామ్మూర్తి ఆమెచేత మాట్లాడించాడు. ప్రేమింపబడ్డాడు. ఇహ ఆమెతో విహరించాలి. ఆమె ఎట్లావుంటుంది?

నేటి ప్రపంచంలో ఆదర్శమైన సౌందర్యాన్ని విడమర్చిచూస్తే, సుప్రసిద్ధతారలు, పుస్తకాలలో నాయికలు, పత్రికలలో ఎడ్వర్టైజ్మెంటు చిత్రాలు, ప్రత్యక్షమవుతాయి. అనేకమైన అందాలనిగుణిస్తే, పరిపూర్ణసౌందర్యంసిద్ధించదు. ప్రత్యేకత, అందంలోని ప్రత్యేకత. కోలమొహం, తీర్చినసన్నటి పొడుగాటికళ్లు, పల్చటి ముక్కు, అమాయకంగా ముద్దుకోసం ముడుచుకున్ననోరు, ప్రాణం తెచ్చుకున్నగడ్డి పోచలా సుకుమారమైన శరీరం - ఆకలి దప్పులు లేని అయోమయపు ఆశ, దారుణాలెరగని దైవత్వం, హద్దులు లేని అనుభవం, ఆమె "ప్రియభారతి".

తను కొంపతీసి నిజంగా కవినేమోనన్న అనుమానం కలిగింది రామ్మూర్తికి. ఎందుకు కాకూడదూ? కవిత్వం నేర్చుకుంటే వొస్తుందా? అదొక ప్రవాహం. సుడిగాలి. జలపాతం. పేలిద్రవించిన అగ్నిపర్వతం. నలుగురు ముందూ బహిరంగంగా చెబితే అర్థంకానిరహస్యం; వ్యవహారికంగా బైటబడనిసత్యం-కవిత్వం.

ప్రియభారతి సృష్టిలోలేదు. నీలో సౌందర్యం అంతటినీ ఆమెకి ఆపాదింపవొచ్చు; నీ అబద్ధపు బ్రతుకు నంతటినీ ఆమెలో యదార్థంచేసుకోవచ్చు. నీరహస్యభావాలని ఆమె చుట్టూ విహరింపచెయ్యవచ్చు. పేలవంగా నిర్జీవంగా వున్న తన జీవితంలో, అలజడి, చాంచల్యం, కోరుతున్నాడు రామ్మూర్తి. వార్తాపత్రిక, తను ఆడని పోటీ ఆటలు మాడ్డం, సినిమాలు, పగటికలలు, ఇవి మిగిలాయి, ప్రజాస్వామ్యంలో సామాన్య మానవుడికి. ఇవితృప్తినివ్వలేవు. ప్రియభారతి అతని పగటికలల చీకటికాంత. ఆమెను అన్వేషించి తెలుసుకోడంలో తనని తానే తెలుసుకుంటున్నాడు. అదే కళాజీవితపు పరమావధి. సామాన్య మానవు లందరూ తలో చీకటి కన్యనీ ఆరాధిస్తున్నారు. ఒకరికొకరర్థంకారు. "నన్ను చూడండి" అని బిగ్గరగా అరుస్తూ వింతదుస్తులు ధరించి వికృతసౌందర్యాన్ని ప్రదర్శిస్తున్నారు. యీ చీకటికన్యకాముకులు— ఆధునిక కళాకారులు. నేటికళలో సౌందర్యశూన్యతకీ అర్థవిహీనతకీ అగమ్యగోచర దృక్పథానికి యిదే కారణం కాబోలు. ఎవరి కళాసృష్టిద్వారా వారు తమ నిజస్వరూపాన్ని తెలుసుకోవడం, వీరి ఆధ్యాత్మిక జీవిత సాధానికి ప్రథమసోపానం.

ప్రియభారతికి రామ్మూర్తి వ్రాసిన ఉత్తరంలో తన్నిగురించి నిజం చెప్పేసుకున్నాడు. ఇదీ ఉత్తరం...

"ఇన్నాళ్లకు తెగించి నువ్వు చేసిన సాహసానికి కృతజ్ఞుణ్ణి. నువ్వు సాహసం చెయ్యగలవన్న ధీమాతోనే నన్ను నీకు దాసుణ్ణిగా

చేసింది. భార్య, పిల్లల్ని గురించి ఆలోచింపకపోలేదు. మానసికంగా ప్రతి వ్యక్తి స్వేచ్ఛాజీవి; అరాజకుడు. సంసారం సంకెళ్లు భౌతికంగా నన్ను సంఘానికి కట్టిపడేశాయి. ఈనాటికి నువ్వు వాటిని తెంపావు. నేను నిన్ను ప్రేమించలేను. ప్రేమించడ మరిచిపోయాను. నువ్వు నేర్పాలి. నీ ప్రేమతో నాహృదయం వికసించి పెరిగింది. ఆనాడు ప్రేమతో నువ్వు చూసినప్పుడు నక్షత్రమండలం కూలిపడినట్లు అనిపించింది. ఆ చూపులో మూగపిలుపు, ఆశ, లాలన, ఓదార్పు—మానవత్వం కన్ను తెరిచినట్లుగా—అన్నీ వున్నాయి.

ఇందులో భార్యకి ద్రోహంచేస్తున్నాననుకోను. అనేక మంది పిల్లలు కలిగి, నడివయస్సులో వున్న కుటుంబీకుడు, ఏ కారుకిందో పడి అకాలమరణానికి గురై, భార్యా పిల్లల్ని నిరాధారుల్ని చేసినప్పుడు, ఆ వ్యక్తిని ద్రోహంచేశాడు అంటున్నామా? ప్రేమరథంకింద పడి హతుడైనా అంతేనంటాను. ఈ అవాంతరాలికి యీ ఎవ్వరూ బాధ్యులుకారు. జననం, ప్రేమ, మరణం—ఇవి జరుగుతాయి; అంతే.

ఇన్నాళ్ళు ఏకపత్నీవ్రతుడుగా వుండడం చాలా శ్రమ. ఉన్నాను; అదీ త్యాగమే. పురుషులు, స్త్రీలు, ఏవొక్కరితోనో వుండగలిగే అలవాటు అలవర్చుకున్నా, స్వభావసిద్ధంగా వారు బహు వాంఛాప్రేరితులు. ఒకరితో వునికి, అనేకులతో విహారం ఇది మానవుడి సహజప్రవర్తన. లేపు మనం అంతే. ఈ యధార్థాన్ని ఎదుర్కొని, యీనాడు ప్రేమజ్వాలలో నశింపుకావటం కంటే, వేరే పరిపూర్ణత లేదు.

నేను నిజంగామంచివాణ్ణే. కాని మంచివాడి మంచితనాన్ని ఎవరూ గమనించరు. ఈవయస్సులో, యీవిధంగా వొక మహత్తరమైన వాంఛకి లొంగిపోయినందుకు సిగ్గుపడటం లేదు. ఈనాటికేనా నన్ను లొంగదీసే శక్తు లున్నందుకూ, వాటిని ఆహ్వానించగల చైతన్యం నాలో యింకా అడుగంటనందుకూ గర్వపడుతున్నాను. దక్షిణపుగాలి పిలిస్తే మేఘం మెల్లమెల్లగా కొంచం కొంచం కదిలిపోదు; అసలు మొత్తంగా కదిలిపోతుంది. యెందుకు? ఏమూలనో వొక్క వర్షపుచుక్క అంటిపెట్టుకుంది. దాన్ని వదల్చుకు నేందుకు. నువ్వు నాపాలిటి దక్షిణపుగాలి...నాలోవున్న బరువునీ, మొద్దుతనాన్నీ నువ్వు తొలగిస్తేగాని నేను రాణించను. నేనొక పనిపావనైతే, నాజన్మనక్షత్రం నువ్వు..."

ఈ వుత్తరం ఎల్లా ముగించాలో రామూర్తికి తెలియలేదు. ఇది వుత్తరం కాదు. ప్రేమతత్వాన్ని గురించిన వొక గ్రంథంగా తయారవుతోంది. ఉత్తరాలతో తృప్తిచెందే యవ్వనపావేశం రామూర్తిలో లేదు. మనస్సులో యధార్థాలు, అసత్యాలూ, ఊహాలు, నమ్మకాలు, తాత్కాలికావేశాలు, శాశ్వతానురాగాలు, మెరుపుల్లా తరుముకుంటూ, మాటల్లో బంధించపడడానికి వ్యవధి లేకుండా మాయమౌతుంటాయి — ఆకులు, ఫలాలు, రాలిపోయిన మోడులాగుంది అతని మనస్సు. పిట్టలు వేసిన రెట్టలమీదనే కొత్త చిగుళ్ళు!

'ఇది నిజం'—'ఇది నేను'—అని పాపం పురుషుడు మేఘాన్ని పట్టుగుని చూపిస్తాడు. అక్కడేమీ వుండదు—అని స్త్రీకి తెలును. ఆమె చేతుల్లో పడింది వర్షపుచుక్క. అతనికది తెలీదు. అత నింకా మేఘంకేసే చూస్తుంటాడు. ఆమె నవ్వక చేసేదేముంది? ఈ నవ్వే స్త్రీలో నిగూఢత్వానికి ప్రతిధ్వని.

మొర్నాడు శాంత యీ వుత్తరం చదువుకొని నవ్వింది—భర్త రహస్యంగా వ్రాస్తుంటే తను పక్కనే కూర్చుని చూసిన దానికి మళ్లే...?

"ఇక్కడో వుత్తరం వుండాలి—చూశావా?" అన్నాడు రామూర్తి.

"ఎక్కడ?"

"ఇక్కడ" అని డ్రాయర్ కేసి చూపించాడు. "ఇదేనా?" అని వుత్తరం తీసుకొచ్చింది శాంత.

"ఎక్కడ దొరికింది?"

"దొరకడాని కేముంది" ముందువా కడుగుదామని వెడితే అక్కడ పడివుంది."

"చూశావా లోపల?"

తల పంకించి శాంత వంటింట్లో కెళ్ళింది. అక్కడ అవిశ నవ్వినట్లు రామూర్తి కనుమానం కలిగింది.

వారం గడిచాక, శాంత పినతల్లి పురుటికి తీసుకెళ్లడానికి వచ్చింది. శాంత, పిల్లలు ప్రయాణమయ్యారు. రామూర్తి స్టేషన్ కెళ్లాడు, సాగనంపడానికి. రైలు కదలడానికి మరో పదినిమిషాలుంది. రామూర్తి అనేకసార్లు ఏదో అడుగుదామని గొంతు సవరించుకొని చేతులు నలుపుకొన్నాడు. ఆఖరికి శాంతే మాట్లాడింది.

"చాకలిపద్దు, దాసుగాణ్ణి మూడమనండి. ఇంకా రెండు తువ్వాళ్లు వొక చీర అట్టే పెట్టుగున్నాడు. ఆరున్నర, పైన అణా కూడా యివ్వకండేం? ధోవతులన్నీ చించి తీసుకొచ్చాడు."

"సర్లేద్దూ, సోది" అని రామూర్తి నవ్వుతూ విసుక్కున్నాడు. రైలు కదిలింది.

"ఫైటకెళ్ళే టప్పుడు దొడ్డిగుమ్మం గడియవేసి మరీ వెళ్తుండండేం"—అంటోంది శాంత. భర్త కేసి భక్తిపూర్వకంగా చూస్తూ, కారుణ్యంతో నవ్వుతూ. ఆ నవ్వులో అమాయకత్వమో, అల్లరి తనమో, ఏది ప్రబలంగా వుందో రామూర్తి నిర్ణయించలేకపోయ్యాడు.

ఆ రాత్రంతా రామూర్తికి నిద్రలేదు. చిన్నతనం, సిగ్గు, వోమాదిరి బిడియం, అతన్ని ఆవరించాయి. ఉత్తరాలన్నీ మళ్ళా సావధానంగా చదువుకున్నాడు. ప్రియభారతి వ్రాసినట్లు తను రాసిన వుత్తరాల్లో స్త్రీదస్తూరి అనుకరించినా, శైలిలో దొరికిపోయ్యేనా, అనుకున్నాడు. స్త్రీల భావాలు, శైలి అల్లా వుంటయ్యా? సంస్కారం గల స్త్రీ అల్లా ఎందుకు వ్రాయకూడదూ? ఈ విషయాలని స్త్రీలు అరోయింద్రియం ద్వారా పసికట్టేస్తారు. మొత్తానికి ఆ వుత్తరాలన్నీ భర్త వ్రాసినవేనని శాంత పసికట్టేసింది. అదీ అతని తలవొంపుకి కారణం.

శాంత తెలుసుకున్నా, తెలియనట్టుగా నటించి, వాదానికి దిగి కొంత అసూయ ప్రకటింపవొచ్చుగా. సంసారం జీవితాన్ని మధురం చెయ్యడానికి ప్రేమద్వేషాలకి సమానశక్తి వుంది. అందుకనే భార్యాభర్తల కొట్లాటలు. పుస్తకాల్లో నాయికలా విరుచుకుపడాలి. నాటకం ఆడాలి. ప్రియభారతి వుత్తరాలగాథ భర్తతో తగాదాకికూడా తగనంతటి అల్పమైనదానికింద జమకట్టేసింది శాంత. అదీ అతని సిగ్గుకి కారణం.

ఏ స్త్రీ తన భర్తను ప్రేమించిందంటే, శాంత నమ్మలేకుండా వుందన్నమాటేగా...! ఎంతవరకూ తన భర్త స్త్రీల ప్రేమకి పాత్రుడో, అర్హుడో, ఆమ తేల్చుకున్నట్టేగాని దాన్ని బట్టి

తనని గురించి ఆమెకి ప్రేమైక జీవితవిషయంలో ఎట్లాంటి అభిప్రాయం వుందో వూహిస్తే కలిగే ఫలితం, బిడియం.

రామ్మూర్తిలో పురుషత్వంవిప్లవం చేసింది. స్త్రీజాతి అతనికి చేసిన సవాల్‌కి తట్టుకోలేకపొయ్యాడు.

ఏ స్త్రీ కూడా అతన్ని ప్రేమించదూ? ఋజువు చెయ్యడానికి సంకల్పించాడు. తనని గురించిన నిజాన్ని తనే ఋజువుచేసుకోసం మానవుడి కడసారి ఆశయం. సత్యాన్వేషణ సాహసంతో కూడిన పని; అందులో మజా వుంది. ఈ సాహసం వ్యక్తిత్వ ప్రకర్ష. అది సంఘంలో స్థిరత్వాన్నీ, వెనుకమాపునీ, మందగమనాన్నీ తృణీకరించి కలవరపెడుతుంది. ఆ వుద్రేకాన్ని అరికట్టడమే ప్రభుత్వాలు చేస్తున్నపని. ప్రజాస్వామ్య ప్రభుత్వాలకిది పెద్ద సమస్య.

మతము, నీతి, ఆర్థిక స్వాతంత్ర్యము, ప్రాణంపైతీపి, ఇవన్నీ పరస్పరానికి, అన్యోన్యానికీ, ప్రపంచ సహకారానికీ పురిగొల్పుతాయి. కాని ప్రాచీనులు – ఆదిమనివాసులు మన పూర్వులిచ్చిన ద్వేషపూరితమైన వుద్రేకాలు. "నిరంతర పోరాట : జీవుల ప్రకృతి శాసనం" అన్నభావం – "అందరూ వొకర్ని వొకరు ప్రేమించుకుంటే ద్వేషించేటందు కెవ్వరూ వుండ"రన్న చైతన్యం— యివన్నీ వ్యతిరేకంగా ప్రబోధిస్తాయి. మానవ సౌభ్రాతృత్వం కొనసాగాలంటే యీ ప్రాచీన తత్వాలనీ, ద్వేషాలనీ, వుద్రేకాలనీ ప్రకటితమయ్యే అవకాశాలు కల్పించి, అరికట్టే మార్గాలనీ ప్రభుత్వాలాలోచించాలి. నేడు రాజకీయవేత్తలకీ, ఫిలింతారలకీ, విఖ్యాత ఆటగాండ్రకీ, యిట్లాంటి "మజా" అనుభవాలు లభిస్తున్నాయి. రామ్మూర్తి యీ అనుభవాన్ని పొంది, తనని గురించిన నిజాన్ని ఋజువు చేసుకోడానికి సమకట్టి వూరంట తిరగడం సాగించాడు. ఉత్తరాలు, వూహించుగున్న అనుభవం చాలవు. రక్తమాంసాలతో సజీవమైన వ్యక్తిపై తన ఆంతరంగికాన్ని పరిశోధించుకోవాలి.

ఎవరిని ప్రేమించడం? తనని ప్రేమించేటందుకు ఏ భర్తవున్న స్త్రీకూడా సిద్ధంగా వుండదు. ఓ వేళ ఉన్నా, భర్తతో తగవులాట, సంఘంలో తలవొంపు తప్పదు. అంచేత సంసారం పితలాటంలేని, కన్యకోసం గాలించసాగాడు. బ్యాంక్ వీధి చివర్లో ఎవరిదో మేడ. మేడమీద గది. గదిముందు బాల్కనీ వుంది. ఆ బాల్కనీలో కుర్చీమీద కూర్చుని, వీధిలో వచ్చేపొయ్యేవాళ్లని చూస్తూ కూర్చుంది, ఆమె ఎవరో. అంత మరీ చిన్నది కాదు ఇరవైయేళ్లుండొచ్చు. పాతిక లోపే. తను ఆ వీధమ్మట నడచిన నాలుగురోజులూ అల్లానే కూర్చుండి అతనికేసి చూసింది కూడా. వెడల్పాటి గుండ్రని మొహం – అతనికి కోలమొహం యిష్టం, కాని ఏం చెయ్యడం!— పెద్ద కళ్లు, మబ్బువిడిచిన ఆకాశంలా నిర్మలమైన శరీర ఛాయ— జడలో రంగురంగుల పూలు. ఆకుపచ్చరంగు చీర. వయ్యారమైన చీరమడతలు. అతను ప్రేమించతగ్గదే అన్నివిధాలా.

పాశ్చాత్యదేశాలలో నడివయస్సులో వున్న పెద్దమనుష్యులు, పనిమనిషితో లేచిపోటం మామూలే. అది లోటువ్యవహారం; అందులో సంస్కారం, అందం, వ్యక్తిగౌరవం, లేవు. అయినా, రామ్మూర్తికి కావల్సింది మానసిక చైతన్యంగాని భౌతిక తృప్తి కాదు.

ఆమెకి వివాహమైందో లేదో తెలుసుకోడం ఎట్లా? పోస్టుబంట్రోతు నడిగితే? వాళ్లకి బట్టలుతికే చాకలాణ్ణి అడిగితే? స్కూలు పిల్లలు యిండ్లకి చేరుకుంటున్నారు. ఇద్దరు కుర్రాళ్లు, వో ఆడపిల్ల, ఆ మేడలోకే వెళ్లారు. వాళ్లని బుజ్జగించి మెల్లిగా ఆరా తియ్యాలి.

నాలుగురోజు లైంతర్వాత, అవకాశం చిక్కింది. ఆ కుర్రాళ్లకి చాకలేట్లు, పిప్పర్‌మెంట్లు పెట్టి, మెల్లిగా వాళ్లతో కబుర్లు సాగించి, వాళ్లతో స్కూలువరకూ నడచివెళ్ళి, ఆరా తీశాడు. పెండ్లి కాలేదు. అమ్మయ్య అనుకున్నాడు. ఇంకా ఎందుకు కాలేదో, ఆమె వాళ్ల కేమవుతుందో యివన్నీ కూడా అడిగాడు కాని వాళ్లు సరైన సమాధానం యివ్వలేదు. రోజూ ఆ వీథంట వెడుతుండేవాడు. ఆ అమ్మాయి అల్లా తనకేసి వీధి మళ్లేవరకూ చూస్తూనే వున్నట్లుండేది.

రామ్మూర్తి మనస్సు వుండబట్టలేకపొయ్యాడు. ఆమెతో మాట్లాడి అడిగెయ్యడానికి నిశ్చయించుకున్నాడు. తీరా వ్యవహారం బెసిగిపోయి, నలుగుర్లోనూ పడిపోతే, ఏం చెప్పడం? నేనో నవల వ్రాస్తున్నాను. అందులో వొకపాత్ర ప్రవర్తన ఎంతవరకూ జీవితాన్ని అనుసరించివుందో నిర్ధారణ చేసుకోడానికి అల్లాచేశాను – అనొచ్చు. అట్లాగంటే నమ్ముతారా? నలభైయేళ్ల పెద్దమనిషి, గౌరవమైన కుటుంబీకుడు, పౌరుడు, మరో వుద్దేశంతో చేస్తాడనుకుంటే, మన సంఘం నేడు ఎంతటి దుర్దశలో వుందో విశదమవుతుంది. అట్లాంటి సంఘానికి, తనకి విలువ కట్టి, తీర్పు చెప్పే అధికారం లేదు; వుండకూడదు.

ఆమెతో ఏమనాలో ముందుగా వో కాగితంమీద వ్రాసుకున్నాడు. రకరకాలుగా వ్రాసిచూశాడు. అతనికి ఆఖరికి నచ్చిందియిల్లా వుంది.

"నువ్వెవరవో నాకు తెలీదు. ఐనా నాకు సన్నిహితురాలవే. మనకి వెనకటి జన్మలో బాంధవ్యం ఏర్పడివుంటుంది. నేను నిన్ను కోరుతున్నాను. నీకు భర్త పిల్లలూ వున్నా కోరివుందును. నాకు వున్నారు. తెగించి సాహసిస్తేగాని ప్రేమకి విలువ లేదు. నువ్వంగీకరిస్తే, మనది మహోన్నతజీవిత మవుతుంది. నిరాకరిస్తే భగ్నజీవినై, పిచ్చివాడినై చెడిపోతాను. పాపాలు, ఘోరాలు చేస్తాను; మరో ప్రపంచసంగ్రామానికి నేను కారకుణ్ణి అవొచ్చు.

ప్రేమ దాస్యం కోరడంలేదు. సంసారంనుండి విమోచన కోరుతున్నాను. నీ స్పర్శకి పంజరం కడ్డీలు వూడి, అందులోంచి పిట్టలాగ నా ఆత్మ ఆధ్యాత్మికసీమలో ఎగిరిపోతుంది. ఆత్మవిముక్తి గీతాసారం.

ప్రేమలేని ఆత్మకి విలువలేదు. ఆత్మలేని ప్రేమ పెంట. రెంటినీ యివ్వాలి నువ్వు.

తర్వాత నిన్ను త్యజిస్తానని భయమా? మంచి చెడ్డలు, ముందు వెనుకలు, జమా ఖర్చులతో నిమిత్తంలేనిది, మహోజ్వల

ప్రేమ. అందులో నశింపవుతాను. ఒక్క సమిధై నువ్వూ సమర్పించాలి.

నాకేం కావాలో నిన్ను కలుసుకున్నంతవరకూ తెలిసింది కాదు. తెలుసుకునేటందుకు నలభై సంవత్సరాలు పట్టింది."

ఇవీ అతను అనదల్చుకున్న ముక్కలు. కంఠస్థం చేసుకున్నాడు. సందర్భానుసారంగా అవతలవ్యక్తి చెప్పే వాక్యాలను వూహించి, వాటి కనువైన సమాధానాలనుకూడా అనుకున్నాడు.

తననిగురించిన నిజం ఆ వాక్యాలలో ఎక్కడో వుందనిపించింది రామ్మూర్తికి. ఎందులోనో తెలియడం లేదు. తేల్చుకోక తప్పదు.

మాట్లాడేటందుకు తగినంత ధైర్యం పురస్కరించుకునేప్పటికి, మరో పదిరోజులు గడిచాయి. ఆ రోజున విద్యాధికారి స్కూలుతణిఖీ వుంది—పొద్దోయింతర్వాతగాని, పిల్లలు యిళ్లకి రారు.

సాయంత్రం ఆరు దాటింది. సూర్యుడు పడమటి ఆకాశంలో గాయంపడినట్లు కుంటుకుంటూ దిగిపోతున్నాడు. రక్తంలా సంధ్య చిమ్మింది. కరిగి కదిలిన మేఘాలవెనక మొదటి నక్షత్రం తళుక్కుమనగానే రామ్మూర్తి తలుపులు తోసి లోనికి ప్రవేశించాడు. తను వొంటిగా వుండటం—చీకటీ—యీ రెండూ కొత్త వుత్సాహాన్నీ తెగింపునీ యిచ్చాయి అతనికి. హాల్లో మూలగా మేడమీదికి మెట్లున్నాయి. గబగబ ఎక్కి బాల్కనీలోకి చేరుకున్నాడు. ఆ అమ్మాయి కుర్చీలో కూర్చునివుంది. లేవలేదు. అతను నిలబడాల్సివొచ్చింది. వెనకాలగదిలో కుర్చీ తెచ్చుకుని కూర్చుంటే? వ్యవధి లేదు. మళ్లా ఎవళ్లేనా రావొచ్చు. కంఠస్థం చేసుకున్న వాక్యాలు చదవడం, మొదలెట్టాడు—ఆమెకళ్లల్లోకి తీవ్రంగా చూస్తూ. ఉద్రేకపు తీవ్రతలో కొన్ని వాక్యాలు వొదిలేశాడు.

"నీకు భర్త పిల్లలూవున్నా కోరివుందును, నాకు వున్నారు"

"సంసారంనుండి విముక్తి కోరుతున్నాను"

"తర్వాత నిన్ను త్యజిస్తానని భయమా?"

"తెలుసుకునేందుకు నలభై సంవత్సరాలు పట్టింది..."అవీ రామ్మూర్తి వొదిలేసిన వాక్యాలు. గడియారంకేసి చూసుకున్నాడు. సరిగ్గా మూడు నిమిషాలు పట్టింది.

సమాధానంకోసం ఎదురుచూస్తూ నిలబడ్డాడు. ఆమె ఏమీ మాట్లాడలేదు. చీరకొంగుని వేళ్లకి చుట్టుకుంటూ . వింతగా నవ్వుతూ కూర్చుంది. రెండుమార్లు లేవబోయి కూర్చుంది.

"చెప్పవూ"

ఆమె మాట్లాడలేదు.

"తొందర్లేదు. ఆలోచించుకుని చెప్పు. రేపిపాటికి వొస్తాను."

ఆమె జడ సర్దుకుంది. తల్లో పూలు కిందపడ్డాయి. అతను తీసి ఆమె చేతి కిచ్చాడు.

"మళ్లా రేపొస్తాను. వెళ్లిరానా?"

ఏమీ సమాధానం లేదు.

రామ్మూర్తి మెట్లు తొందరగా దిగి హాల్లోకి చేరుకున్నాడు. వెనుక ఎవరో కదిలినట్లనిపించింది. మెట్లపైకి చూశాడు.

హాల్లో తలుపువెనకాల నిలబడివుంది, ఆమె ఎవరో—పెద్దామె—సన్నటి దీపంవెలుగులో బాగా కనబల్లేదు.

"నేనంతా విన్నానండి బాబూ. మా అక్కయ్యకూతురే. మీ కెవరేనా తమ్ముళ్లుగాని, మొగపిల్లలు వుండి పెండ్లి చేసుకుంటే మా క్కాదన్నిందేముంది. ఏం చెయ్యం, దాని కర్మ పెండ్లి కావడంలేదు. మూగపిల్ల. మీ ఎరికిలో ఎవరేనా వుంటే చూడ్డరు బాబు."

రామ్మూర్తి ఎట్లాగో శ్వాస తీసుకుని వీధులోకి వూడిపడ్డాడు. ఉద్యోగంకోసం మొదటి యింటర్వ్యూకి వెళ్ళిననాటి మల్లే, కాళ్లు చేతులు తిమ్మిరెక్కి, వొళ్లంతా చెమట్లుపోశాయి. విశ్వమంతా తన చుట్టూ కూలిపడితే అట్లాగుంటుంది కాబోలు.

లాటీదెబ్బలకీ, కత్తిపోట్లకీ, తుపాకి గుండ్లకీ బలికావడానికి శరీరం సిద్ధపడుతుంది. అహం వొక్కమాటతో ఘూర్ణిల్లుతుంది. ముసలామె చేసిన తీర్పు—జన్మాంతరశిక్ష. మూగ పిల్లకికూడా తను తగడు. తన ఎరికిలో ఎవరేనా వుంటే చూడాలిటా? అంతకంటే ఉరికంబం మేలు.

స్వార్థం గాయపడినప్పుడు బుద్ధిచలిస్తుంది. ఊహ బీభత్సంగా తయారవుతుంది. ఉద్యోగానికి రాజీనామా యివ్వాలనిపించింది. ప్రపంచమంతా వొక కాలు మీద గెంతుకుంటూ చుట్టిరావాలనిపించింది. సన్యాసం పుచ్చుకోవాలనిపించింది. ఎవరినో హత్య చేయ్యాలనిపించింది. దీనికంతకీ బాధ్యురాలు, శాంత. తనచేత కూలివాడిమాదిరి వెట్టిచాకిరీ చేయించుకుని, శక్తుల్ని ధ్వంసంచేసి వార్ధక్యం వప్పగించి, తను పిల్లలతో హాయిగా పురిటిమంచంలో కులుకుతోంది. స్త్రీకి బాధ్యతలే లేవు. పిల్లల్ని కనడం ఆమె హక్కు. వాళ్లకి అన్నంపెట్టడం, మొగాడి బాధ్యత. తను పట్టుచీర సింగారించుకుని పేరంటాని కెళ్లడం ఆమె హక్కు. సంతానాన్ని తోలేలు ఎత్తుకుపోకుండా కాపలా వెయ్యడం వీడి బాధ్యత. హక్కులు బాధ్యతలు...ఈ బాధ్యతలు, హక్కులు అనే మాటలు పనేళ్లవరకూ ఏ పత్రికా వాడకూడదని ఐక్యరాజ్యసమితి శాసిస్తే బావుండును. ఇంటికి చేరుకున్నాడు రామ్మూర్తి. గుమ్మంలో పోస్టు బంట్రోతు సైకిల్ దిగి టెలిగ్రాం అన్నాడు. ప్రసవించి, శాంత మరణించిందన్న వార్త రాకూడదూ...!

శాంత పినతండ్రి పంపిన టెలిగ్రాం అది. నెప్పులు ప్రారంభమయ్యాయనీ, ఆ సమయంలో తను దగ్గర వుండడం అవసరం గనుక తక్షణం బైలుదేరి రమ్మనీ—వుంది.

రామ్మూర్తి మెట్లమీద వాలిపోయ్యాడు. శాంతలేని సంసారం వూహించలేక పోయ్యాడు. తనకి నాడు జరిగిన పరాభవాన్నుండి తేల్చగల శక్తి మరెం కెవరికుంది? ఆమె దగ్గర తను దాచలేడు. చెప్పకపోయినా, ఆమె ఎల్లాగో తెలుసుకుంటుంది. తనకి విషాదంగా తోచినవాటిని నవ్వి పారేస్తుంది. తన కప్రస్తుతమని తోచిన చాకలిపద్దు విషయం ఎంతో పట్టింపుచేస్తుంది. చిత్రమైన మనిషి. వారి అన్యోన్యానికి కారణం ప్రేమా? కాదు. అదే

మిటో అతనికి తెలీదు. ప్రేమనుగురించి ఆమె ఎప్పుడూ ముచ్చటించలేదు. ఉత్తరాల్లో వ్రాయలేదు. ఆమెతో మాట్లాడేందుకు ఏవీ కనుపించవు, ఆమె వుంటుంది. లేకపోతే తన జీవితంలో ఏదీ చోరలేని ఖాళీ ఏర్పడుతుంది. ఆమె మరణం అనూహ్యం. భాషా భావాలు లేకుండా, వాతావరణంపై వొత్తిడి కలిగించి పరివర్తన తీసుకురాగల కవయిత్రి శాంత—

ప్రయాణమయ్యాడు. రైల్లో ఎన్నో ఆలోచనలు. తన వివాహం. కొత్తలో శాంత సిగ్గు; చీరకొంగులో నవ్విన దృశ్యం. వికృతంగా ఆవులించడం—ఆమె వికృతంలో, అల్పత్వంలో, సౌందర్యం వుంది.

'తర్వాత?'

తననిగురించిన నిజం, మూగపిల్లముందు కంఠస్థంచేసి చెప్పిన వుపన్యాసంలో, వొదిలేసిన వాక్యాల్లో వుంది. అప్రయత్నంగా వాటిని విడిచిపెట్టినట్లా? లేక కావాలని వొదిలేసినట్లా?

తెల్లవారింది.

కొంతదూరం బండిమీద ప్రయాణం చెయ్యాలి.

ఇంటికి చేరుకునేటప్పటికి, సాయంత్రం ఏడు గంటలు కావస్తోంది. శాంత పినతండ్రి కలుసుకున్నాడు గుమ్మంలో.

"అమ్మాయి వొద్దంది. నేనే యిచ్చా టెలిగ్రాం. ఎందుకేనా మంచిదని. నిన్న నే ప్రసవించింది. తల్లి పిల్ల క్షేమంగానే వున్నారు. ఏమీ ఎక్కువ కష్టపడలేదు. పైవాళ్ల ఆదుర్దా..."

"ఆడపిల్లా" అన్నాడు రామ్మూర్తి.

చూస్తొచ్చునన్నారు. తొందరగా గదిలో కెళ్లాడు. అంతా నిశ్శబ్దం. వెన్నెట్లో వొస్తువు లన్నీ తెల్లటి పొర కప్పుకున్నట్లయింది. ఇంటి కప్పుమీదనుంచి జారిన వెన్నెలవెలుగు శాంత నుదిటిమీద గీతలా పడుతూంది. ఆనాడు సౌందర్యం తన యాత్ర ముగించుకుని పవ్వళిస్తోంది.

శాంత నీరసంగా నవ్వింది. పాపకేసి చూపించింది.

దీపం పెద్దది చేసి చూశాడు. అతను నమ్మలేకపోయాడు. భ్రమా? నిజమా? నవ్వుకి శాంత మూతి వొంకరయింది. నిశ్చలంగా అతని కళ్లల్లోకి చూసింది. పరిమళం బరువుకీ, రంగు వొత్తిడికీ, తట్టుకోలేక వాడిపోయిన అడవిపువ్వుల్లో కొత్తదనం. పర్వత శిఖరాన్నుంచి జారివిడిపోయిన మంచు ముద్దలోని నిర్మలత్వం. నిశీధిలో సృష్టి వేసుకొన్న మంటలోనడిజ్వాల, అర్ధరాత్రి జీవులకన్న స్వప్నంలోని మూగ బాధ—అన్నీ వున్నాయి, ఆ చూపులో.

రామ్మూర్తి జీవితంలో సత్యాన్ని ఎదుర్కొన్నవానివలె హాశికిపొయ్యాడు. చెప్పేటందుకు ఏముంది? వెనక్కి తిరిగాడు.

"మాట" అంది శాంత మెల్లగా.

నిలబడ్డాడు. దగ్గరగా రమ్మని సంజ్ఞచేసింది.

"మావాళ్లకి తొందర. నాతో చెప్పకుండా టెలిగ్రాం యిచ్చారు." అంది.

"దానికేం మంచిపనే చేశారు. నాకూ చూడాలనుంది" అన్నాడు రామ్మూర్తి.

"ఇదుగో" అని— ఏదో అనబోయింది.

"ఏం ?"

"ఏమీ లేదులెండి." శాంత పక్కగా తిరిగి పడుకుని దుప్పటీ రొమ్ముపైకి లాక్కుంది.

రామ్మూర్తి వీధులోకి వొచ్చేసి అరుగుమీద కూర్చుని చంద్రుడికేసి చూస్తూ పదినిమిషాలు గడిపాడు. రెండోవాడు "సేతు" వొచ్చి—

"ఇదుగో నాన్నా ఏదో కాగితంట, అమ్మ నీ కివ్వమంది" అని కాగితం యిచ్చాడు.

రామ్మూర్తి లోపలిగదిలో కొచ్చి దీపంవెలుగులో ఆవుత్తరం చదువుకున్నాడు.

"మన స్వప్నం ఫలించింది. ఆడపిల్లకి 'రామప్రియ' అనిపేరు పెట్టుకుంటా. ఇంక మీరు మంచివారుగా వుండనక్కర్లేదు. మీ ప్రియభారతి."

రామ్మూర్తి అప్రయత్నంగా నవ్వేశాడు. గదిలోకెళ్లి పాపకేసి చూశాడు. సందేహంలేదు. అంతా తన వూహలో చిత్రించుకున్న ప్రియభారతి పోలికే...ఆ కోలమొహం, సన్నటి తీర్చిన కళ్లు, మధురంగా ముడుచుకున్న పెదవులు—అంతా ఆమే.

అసంభవం. తను స్వప్నంలో బంధించుకొన్న కవితాసతి ఛాయల్ని తనభార్య నవమాసాలూ మోసి, పెంచి, కన్నదా ?

భ్రమ.

అవుతే భ్రమ నిజం. ఔటకి రాగానే అతనికో అనుమానం తట్టింది. బెదరిపోయ్యాడు. గబగబ గదివైపు నడిచాడు. తలుపు తోయ్యబోయ్యాడు. పాపఏడుపు వినబడింది. "అమ్మయ్య" అనుకున్నాడు.